వర్షం.. వరి రైతుకు నష్టం

- తుపాను వల్ల నదీతీర ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి పంటలు
- 70 శాతం మేర నేలవాలిన పైరు
- ఆందోళనలో అన్నదాత



ఒరిగిన పంటను సరిచేసుకుంటున్న రైతన్నలు



ప్రతి వరిమడిలో ఇలాంటి పరిస్థితే

కౌతాళం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాన్ కారణంగా నదీతీర పాంత్రాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి పైరు పూర్తిగా ప్రస్తుతం పొట్టదశలో నెలకొరిగి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. తుంగభద్ర నదీతీరంలో సాగు అయిన పంట 70శాతం వరకు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

15 వందల ఎకరాల్లో సాగు..

గతేడాది వరి పంటకు గిట్టుబాటు ధర పలకడంతో ఈసారి చాల మంది రైతులు వరిని అధికంగా సాగు చేశారు. మండలంలోని నదీతీరంలో ఉన్న నదిచాగి, మేళిగనూరు, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు-1, 2, మరళి, గుడికంబాలి, వల్లూరు గ్రామాల్లో ప్రధానంగా వరి పంటను అధికంగా సాగుచేశారు. ఈ ఆరు గ్రామాల్లో సుమారు 15 వందల ఎకరాల్లో వరి వేశారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉన్నాయి. నవంబర్ రెండో వారంలో మరో 20 రోజులకు పంట చేతికి వస్తుందనుక్ను తరుణంలో వర్షం వల్ల నష్టం కలిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దిగుబడి తగ్గే అవకాశం

పంటలు చాలా వరకు నెలకొరగడంతో దిగుబడి ఎకరాకు 5 నుంచి పది బస్తాల వరకు తగ్గుతుందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు బసవ, గోవిందు, రామన్నగౌడ్, లింగన్నగౌడ్, ఈరన్న, అనిల్, సుభాన్‌తో పాటు పలువురు రైతులు తెలిపారు. తమను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కౌలుకు 10 ఎకరాలు సాగుచేశా

గతేడాది వరి పంటకు గిట్టుబాటు ధర పలకడంతో ఈసారి కౌలుకు తీసుకున్న 10ఎకరాల్లో మొత్తం వరి పంట సాగు చేశా. అయితే ఈ తుపాన్ వల్ల తనకు తీవ్ర నష్టం వాటిల్లింది. 50 శాతం పంట పూర్తిగా నెలకొరిగింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.



– చాకలి బసవ, రైతు

ప్రభుత్వం పరిహారం అందించాలి

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి. 12 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట 70శాతం ఒరిగిపోవడంతో ఎకరాకు రూ.15వేల వరకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. తుపాన్ వల్ల నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకుంటే తప్ప కొలుకునే పరిస్థితి లేదు.



– లింగన్నగౌడ్, నదిచాగి

క్లుప్తంగా

ఘనంగా మాబుసుభాని ఉరుసు



దర్గా వద్ద నిర్వాహకులు గౌస్‌పీరా తాతతో భక్తులు

కోసిగి : మండల కేంద్రం కోసిగిలోని రంగప్ప గట్టు వద్ద వెలసిన మాబుసుభాని ఉరుసు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా నిర్వాహకులు చందాఉసేన్ కుమారుడు గౌస్ పీరా తాత ఆధ్వర్యంలో ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి హిందూ, ముస్లింలు కులమతాలకు అతీతంగా తరలి వచ్చి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు చేసుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

25 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ఓపన్ స్కూల్ అడ్మిషన్లకు ఈ నెల 25వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువు పెంచినట్లు ఓపన్ స్కూల్ కో ఆర్డినేటర్ మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారికి సార్వత్రిక విద్యా పీఠం ఓపెన్ స్కూల్(అపాస్) 10వ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకోవడానికి మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. 10వ తరగతిలో అడ్మిషన్ కాదలచిన వారికి 14 ఎళ్లు, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ కోసం 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గోనెగండ్లలో భజన పోటీలు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెల పూజ సందర్భంగా భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పూజారులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ భజన పోటీలు 22వ తేదీ రాత్రి 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. భజన పోటీలలో పాల్గొను బృందముల వారు అదే రోజు రాత్రి 8 గంటల లోపు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి ఆలయంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా తొమ్మిది స్థానాల్లో 30 తులాల వెండి, 20 తులాలు, 15 తులాలు, 10 తులాలు, 8 తులాలు, 5.1/2 తులాలు, 5 తులాలు, 2.1/2 తులాలు, 2 తులాల వెండి బహుమతులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9912050356, 9885637504 నంబర్లను సంప్రదించాలన్నారు.

కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో ఉన్న ప్లాట్‌ను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైన కబ్జాకు పాల్పడితే నాలుక చీరేస్తామని ఎమ్మెల్యే డా.పార్థసారధి ఎన్నికల ముందు చెప్పారని, ప్రస్తుతం తన అనుచరుడే కబ్జాకు పాల్పడ్డాడని.. ఆయన ఏమి చీరేస్తారో చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే డా.రవికుమార్ నకలీ ఆధార్ కార్డు సృష్టించి తన తల్లి పెరు మీద స్థలం రిజిస్టర్ చేసుకున్నాడన్నారు. కబ్జాకు పాల్పడిన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన 'పల్లెపండుగ'



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

పెద్దకడబూరు : మండలంలో రూ.30లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. పల్లె పండుగ చివరి రోజు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో రూ. 10లక్షలతో, హెచ్.మురవణి గ్రామంలో రూ. 10లక్షలతో, కంబదహాల్ గ్రామంలో రూ. 10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ జయరాముడు తెలిపారు. కార్యక్రమంలో దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, కంబదహాల్ సర్పంచ్ దస్తగిరి, పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, ఈసీ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు చెరువులు అప్పగించాలి

ఆదోని రూరల్: చెరువు, నీటి కుంటలు గంగపుత్రులకు అప్పజెప్పాలని గంతపుత్ర, బెస్త మత్స్యకార సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కోరారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గంగపుత్ర, మత్స్యకారుల కులస్తులకు ఇస్తున్న అన్ని రకాల పథకాలను, హక్కులను వారే అనుభవించడానికి అన్ని రకాలుగా తోడుగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బెస్త ప్రకాష బెస్త రామాంజనేయులు, బెస్త నాగరాజు, నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

విజయవాడ వరద బాధితులకు గ్రౌండ్ నట్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.51 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి అందజేశారు.

భయాందోళ వద్దు



కత్తుల గొట్టు కొండపై పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

పెద్దకడబూరు : చిరుత పులుల పట్ల రైతులు, ప్రజలు భయాందోళనలకు గురికావద్దని ఫారెస్టు అధికారులు రామ్మోహన్, నదిముల్లా సూచించారు. మండల పరిధిలోని మేకడోణ గ్రామం కత్తుల గొట్టు కొండ సమీపంలో శనివారం సాయంత్రం చిరుత సంచరిస్తున్నట్లు గమనించిన గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం చేరవేశారు. స్పందించిన వారు ఆదివారం చిరుతపులి సంచిరించిన ప్రదేశాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ చిరుతపులులు ఒకచోట ఉండవన్నారు. వాటి ఆహారం కోసం కొండలు, గుట్టలు తిరుగుతునే ఉంటాయన్నారు. అవి కనిపించిన చోటు ప్రజలు అల్లర్లు చేయరాదని, అల్లరి చేయకుంటే వాటి దారిలో అవే వెళ్లిపోతాయని చెప్పారు. శువులను రాత్రి సమయాలలో జాగ్రత్తగా ఇంటి దగ్గరే కటివేయాలని సూచించారు. ఉదయం సమయంలో మాత్రమే మేతకు తీసుకెళ్లాలన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం



మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా నేటికీ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకపోవడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, కమిషన్ రిపోర్ట్ వచ్చేలోగా 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 117 జీఓను సత్వరం రద్దు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు రూ.22వేల కోట్లను సత్వరం మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌టీయూ నాయకులు ప్రసన్నరాజు, ఎల్లప్ప, సురేష్, శేఖర్, చంద్రశేఖర్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



పెద్దనేలటూర్‌లో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

గోనెగండ్ల: మండలంలోని పెద్దనేలటూర్, చిన్నమరివీడు, గుల్లమొరుసు గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి హాజరై ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణి మంజరి, పీఆర్‌డీఈ చంద్రశేఖర్, ఆయా శా ల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని రూరల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఆదివారం మండలంలోని సలకలకొండ గ్రామంలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో కొత్తగా మంజూరైన సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంపాపతి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఆయాశాఖల అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ చిన్నప్పరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తున్నట్లు క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చిన్నప్పరెడ్డి తెలిపారు. పట్టణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్‌కుమార్ 235 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 62మందికి శస్త్ర చికిత్సలు చేసేందుకు రెఫర్ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నటరాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 220 దేశాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్ ముందుందన్నారు. భారత దేశంలో పోలియో మహమ్మారిని తరిమికొట్టడంలో ప్రధాన భూమిక పోషించిన సంస్థ రోటరీక్లబ్ అన్నారు. బాలికలకు ఉచిత సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు మాచాని శివకుమార్, కార్యదర్శి సుధాకర్‌రావు, షఫీవుల్లా, కురువ బీరప్ప, ఏపీ శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, న్యాయవాది గురు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగదు.. మురుగు పారదు



మదీన మజ్జీద్ ఎదురుగా చెత్త ఎత్తకుండా వదిలేసిన దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో డ్రైనేజీల్లో పెరుకుని పోయిన చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది తొలగించడంలేదు. కొన్ని చోట్ల తొలగించిన చెత్తను తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో ఆ చెత్త అంత మళ్లీ డ్రైనేజీల్లో పడి మురుగునీరు ముందుకు పారకుండా నిల్వ ఉంటోంది. వైఎస్సార్ సర్కిల్‌లోని మదీనా మజ్జీద్ వద్ద డ్రైనేజీ నుంచి చెత్తా చెదారాన్ని తొలగించి ఐదు రోజులు గడిచినా దానిని తొలగించక పోవడంతో చెత్త అంతా తిరిగి డ్రైనేజీలో పడి మురుగు నీరు ముందుకు పోకుండా దుర్వసన వస్తోంది. ప్రధాన రహదారిలోని పరిస్థితి ఇలా ఉంటే ఇక వీధుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా అధికారులు తొలగించిన చెత్తను ఎత్తుకుని పోవాలని, డ్రైనేజీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మూడేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి

- గుండె పోటుతో ఇద్దరూ మృతి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు



తల్లి మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారులు

పత్తికొండ(తుగ్గలి) : మూడేళ్ల క్రితం తండ్రి గుండె పోటుతో మృతి చెందగా..ఇప్పుడు తల్లి మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలయ్యారు. పత్తికొండ మండలంలోని చందోలి గ్రామానికి చెందిన తుప్పటి లక్ష్మి (34)కి 15ఏళ్ల క్రితం తుగ్గలి మండలం మారెల్లకు చెందిన అంజినయ్యతో వివాహం జరిగింది. వీరికి జయశ్రీ (13), అంకిత (10), ఉషశ్రీ (5) కూతుళ్లు ఉన్నారు. కూలీ నాలీ చేసుకొని జీవనం సాఫీగా సాగుతున్న సమయంలో మూడేళ్ల క్రితం అంజినయ్య గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో లక్ష్మి పుట్టినిల్లు చందోలికి వచ్చింది. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో సమీప బంధువు దగ్గర ఉంటూ కూలీ పనులకు వెళ్తూ పిల్లలను పోషిస్తోంది. ఆదివారం పొలం పనులకు వెళ్లిన లక్ష్మి.. ఇంటికి వచ్చిన కాసేపటికే గుండె పోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. లక్ష్మి మృతితో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. ఈ ఘటనతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారంమాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, భండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.స్థానికులే కాకుండ కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన పెరగాలి

కర్నూలు(హాస్పిటల్): ఆర్థరైటిస్ (కీళ్లవాతం)పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, రుమటాలజిస్టు డాక్టర్ శ్రీహరిరెడ్డి చెప్పారు. వరల్డ్ ఆర్థరైటిస్ డే పురస్కరించుకుని ఆదివారం ఉదయం కర్నూలు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టరేట్ వద్ద డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, శ్రీహరిరెడ్డి ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి ప్రారంభమై రాజవిహార్ వరకు కొనసాగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆర్థరైటిస్‌తో బాధపడే వారి సంఖ్య పెరిగిందన్నారు. జీవనశైలిలో మార్పులతో పాటు ఆహారపు అలవాట్లు, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల ఆర్థరైటిస్ వస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే రోగులు వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలన్నారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే నయం చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. లేకపోతే దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి వస్తుందని చెప్పారు. నర్సింగ్ విద్యార్థులు, మెడికల్ రెప్స్, ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ అండదండలతోనే కబ్జా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వ అండదండలతోనే ఆదోని పట్టణంలో భూ కబ్జాలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో కురువ హనుమంతమ్మకు చెందిన స్థలాన్ని ఓ డాక్టర్ కబ్జా చేశాడన్నారు. కురువ హనుమంతమ్మ తన స్థలాన్ని పశువులను కట్టేసుకునేందుకు వాల్మీకులకు ఇచ్చిందన్నారు. అయితే ఆ స్థలం పక్కనే ఉన్న ఓ డాక్టర్ కురువ హనుమంతమ్మ పేరుమీద ఉన్న ఆధార్‌కార్డును మార్ఫింగ్ చేసి స్థలాన్ని తన బావమరిది పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. కూటమి నాయకుల అండదండలతో ఈ వ్యవహారం జరిగిందని తెలిపారు. సమావేశంలో నాయకులు భాస్కర్, పగడాల నారాయణ, కామాక్షి తిమ్మప్ప పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకం ఏమైంది?



ప్రభుత్వానికి పంపే పోస్టల్ కార్డులను చూపుతున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం పథకం హామీ ఏమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్, నియోజకవర్గ ఖాశింవలి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత బస్సు ప్రయాణం అమలుపై మహిళలతో మాట్లాడి ప్రభుత్వానికి పోస్టు కార్డులను పంపించారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇంత వరకూ ఇచ్చిన హామీపై నిర్ణయం తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వెంటనే ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తేవడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాఖలందర్, జైపాల్, లోకేష్, వలి, షబాన తదితరులు పాల్గొన్నారు.



మేదర్‌గేరిలో ఫ్లై ఓవర్‌పై పడిన గుంతలు

గుంతలు ఓవర్

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని మేదర్‌గేరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి గుంతలమయంగా మారింది. బ్రిడ్జిపై బీటీ రోడ్డు అడుగడుగునా గుంతలు పడింది. దీంతో పాదచారులు, వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నా ఆర్అండ్‌బీ అధికారులకు పట్టకపోవడం శోచనీయం. గుంతలను పూడిస్తే రాకపోకలు జరుగుతాయని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆదోని పట్టణంలో మేదర్ గేరి నుంచి సిరుగుప్ప చెక్‌పోస్టు వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పెట్రోల్‌బంక్ వద్ద రోడ్డు దుస్థితి

రహదారులు అధ్వానం



బాపురం రోడ్డులో దుస్థితి

కౌతాళం: ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. పాదచారులు సైతం నడవలేని స్థితిలో ఉన్నాయి. మండల కేంద్రమైన కౌతాళంలో చినుక పడితే ప్రతి రోడ్డూ చిత్తడి మారుతోంది. ప్రధానంగా బాపురం రోడ్డులో పెట్రోల్‌బంక్ వద్ద పరిస్థితి చాల దారుణంగా ఉంది. అడుగు లోతులో గుంతలు పడడంతో వాహనదారులు ద్విచక్ర వాహనాలు తిగరడానికి చాల కష్టంగా మారింది. వీటికి మరమ్మతులు చేపట్టాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కనీసం ఈ గుంతల్లో గ్రావెల్ అయిన వేస్తే కొంత వరకు వాహనదారులకు, పాదచారులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.